క్లుప్తంగా

విప్‌ను కలిసిన రైతులు



విప్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

పెగడపల్లి: ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను పెగడపల్లి మండలంలోని నందగిరి గ్రామ రైతులు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కుమ్మరికుంటలోకి వరదకాల్వ నుంచి నీటి సరఫరా చేసేందుకు తూము నిర్మాణానికి హామీ ఇచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కుమ్మరికుంట నిండితే రైతులకు పంటలకు సాగు నీరందడంతో పాటు ముదిరాజులు చేపల పెంపకంతో జీవనోపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో విండో చైర్మన్ భాస్కర్ రెడ్డి, నాయకులు సుంకరి రవి, అశోక్‌రెడ్డి, గంగాధర్, గర్వంద సతీశ్, ముదిరాజు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలను వినియోగించుకోవాలి

కథలాపూర్: పోస్టల్ బీమా పథకం ప్రవేశపెట్టి ఫిబ్రవరి 1 నాటికి 141 ఏళ్లు అవుతుందని, ప్రజలు పోస్టల్ పథకాలను వినియోగించుకోవాలని ఉమ్మడి కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ శివాజీ కోరారు. శుక్రవారం మండలంలోని సిరికొండ గ్రామంలో సబ్ పోస్టాఫీసును ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. పోస్టల్ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి అందులో చేరేలా ప్రోత్సహించాలన్నారు. సబ్ పోస్ట్‌మాస్టర్ జయరాం, బీపీఎంలు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లకు సత్కారం



డ్రైవర్లను సన్మానిస్తున్న డీఎం

కోరుట్ల: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆర్టీసీ డిపోలో ప్రమాదరహిత డ్రైవర్లు రాజలింగం, యూసుఫ్, శేఖర్ లను డిపో మేనేజర్ సత్కరించారు. డ్రైవర్లు జాగ్రత్తగా బస్సులు నడుపుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని డీఎం సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్లు గంగారాం, వర్ధీలాల్, షాదిక్, బాబు, సాగర్, పాల్గొన్నారు.

పసుపు కొనుగోళ్లు ప్రారంభం



కొనుగోళ్లను ప్రారంభిస్తున్న చైర్మన్ గోవర్ధన్

మెట్‌పల్లి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పసుపు కొనుగోలును శుక్రవారం చైర్మన్ కూన గోవర్ధన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పచ్చి పసుపును కాకుండా ఎండిన తర్వాత యార్డుకు తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్లు పుల్లూరి నవీన్, సంగు గంగాధర్, కాటిపెల్లి అనంతరెడ్డి, వ్యాపారులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ స్థలం ఎంపికపై వివాదం

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే పెట్రోల్ బంక్ కోసం స్థలం ఎంపికపై వివాదం నెలకొంది. పెట్రోల్ బంక్‌ను గంభీర్‌పూర్ గ్రామశివారులో బొమ్మెన గ్రామానికి వెళ్లేరోడ్డులో ఏర్పాటు చేయాలని సొసైటీ పాలకవర్గ సభ్యులు తీర్మానించి ఉన్నతాధికారులకు పంపించారు. కానీ స్థలాన్ని మార్కెట్ రేటు కంటే అధిక ధరకు కొనుగోలు చేయడం సరికాదని రైతులు పేర్కొన్నారు. ఈ విషయంలో పాలకవర్గసభ్యులకు, రైతులకు మధ్య గ్రామంలో మూడురోజులుగా వివాదం జరుగుతుంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో గ్రామంలో ఈ వివాదం ముదిరి రాజకీయంగా వేడిక్కిందనే ప్రచారం జరుగుతోంది.

'పథకాల అమలులో కాంగ్రెస్ విఫలం'

జగిత్యాలరూరల్: సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ఆరోపించారు. రాబోయే రోజుల్లో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని, కార్యకర్తలు పార్టీ అభ్యున్నతికి పనిచేయాలని పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మోరపల్లి, అనంతారం, గుట్రాజ్‌పల్లి, కల్లెడ గ్రామాల్లో సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఆనందరావు, నాయకులు పడిగెల గంగారెడ్డి, కమలాకర్‌రావు పాల్గొన్నారు.

ఎండుతున్న జొన్నకుంట

- ఆయకట్టు రైతుల ఆందోళన
- తగ్గిపోతున్న భూగర్భ జలాలు
- ఎస్సారెస్పీ నీటితో నింపాలని కోరుతున్న రైతులు



గోదూర్‌లో అడుగంటిపోతున్న జొన్నకుంట

ఇబ్రహీంపట్నం: ఎండలు ముదరకముందే కుంటలు ఎండిపోతుండడంతో ఆయకట్టు రైతులు, గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని గోదూర్‌లోని జొన్నకుంటలో నీళ్లు అడుగంటిపోతుండడంతో ఆయకట్టు రైతులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వర్షాకాలం వర్షాలు భారీగా పడి కుంటలు, చెరువులు నిండి జలకళను సంతరించుకున్నాయి. కానీ ఎండాకాలం ఇంకా ప్రారంభం కాకముందే కుంటల్లో నీళ్లు అడుగంటిపోతుండడంతో వచ్చే మే నెల వరకు తీవ్రంగా ఎండలు ఉండే అవకాశం ఉన్నందునా నీటికి కటకటలాడే పరిస్థితి నెలకొననుంది.

జొన్నకుంటనే సాగు, తాగునీటికి ఆధారం

జొన్నకుంటలో నీరు సమృద్ధిగా ఉంటే గ్రామంలోని బోర్లు, బావుల్లో భూగర్భజలాలు నిండుగా ఉంటాయి. మిషన్ భగీరథ నీరు రాన్నప్పుడు ఈ కుంట కిందనే రక్షిత మంచినీటి బావి ఉండడంతో ఈ బావిలో నీళ్లు అడుగంటిపోవడంతో గ్రామస్తులకు మంచినీటని సరఫరా చేయలేకపోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కుంటలో ఇప్పుడే నీరు అడుగంటిపోవడంతో వచ్చే వేసవిలో నీటికి ఇబ్బందులు ఎదుర్కనే పరిస్థితి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

ఆయకట్టు రైతుల ఆందోళన..

జొన్నకుంట కింద సుమారు 30 ఎకరాల్లో వరి పంట సాగవుతండగా కుంటలో నీరు ఇప్పుడే అడుగంటి పోవడంతో యాసంగి వరి నాట్లు వేసిన రైతులు సాగుకు నీరందక ఎండిపోయే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎస్సారెస్పీ కుంటతో నీటిని నింపాలి

జొన్నకుంటకు ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీటిని నింపితే సాగు, తాగునీటికి ఇబ్బంది ఉండదని, గ్రామంలో బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని వెంటనే ఎస్సారెస్పీ అధికారులు చర్యలు తీసుకుని జొన్నకుంటను ఎస్సారెస్పీ నీటి ద్వారా నింపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కుంటనే ఆధారం



జొన్నకుంట మా గ్రామానికి ఆధారం. ఈ కుంటలో నీళ్లు నిండుగా ఉంటే గ్రామంలోని బోర్లు, బావులలో భూగర్భజలాలు ఉంటాయని, రక్షిత మంచినీటి ట్యాంక్‌కు కూడా ఈ కుంట కింద ఉన్న బావి నుంచే సరఫరా చేస్తారని, కుంటను ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీటిని నింపి ఆదుకోవాలి.

– ఎడపల్లి వెంకటస్వామి, వీడీసీ అధ్యక్షుడు, గోదూర్

పొలాలు ఎండిపోయే పరిస్థితి



జొన్నకుంటలో నీళ్లు అడుగంటిపోతుండడంతో యాసంగిలో సాగు చేసిన పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఈ యాసంగిలో వేసిన పొలాలు ఎండిపోకుండా ఎస్సారెస్పీ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే చర్యలు తీసుకుని కాలువ తూము నుంచి జొన్నకుంటను నింపాలి.

– శ్రీనివాస్, రైతు, గోదూర్

రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు

- కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



ఓబన్న విగ్రహం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

కోరుట్ల రూరల్: నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క నిధులు మంజూరు చేశారని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ శుక్రవారం తెలిపారు. కోరుట్ల మండలంలోని చిన్న మెట్‌పల్లి–వెంకటాపూర్ గ్రామాల మధ్య బీటీ రోడ్డుకు రూ. 1.35 కోట్లు, కోరుట్ల జాతీయ రహదారి నుంచి సంగెం బీటీ రోడ్డుకు రూ.78 లక్షలు, ఇబ్రహీంపట్నం మండలంలోని కోమటి కొండాపూర్‌లోని గోదావరి నది బీటీ రోడ్డుకు రూ. 65.75 లక్షలు, మల్లాపూర్ మండలంలోని వాల్గొండ నుంచి గొర్రెపల్లి వరకు బీటీ రోడ్డుకు రూ.1.45 కోట్లు , వేంపెల్లి వెంకట్రావుపేట నుంచి గౌరీశ్వరం ఆలయం వరకు రూ.99.60 లక్షలు, మెట్‌పల్లి మండలం చౌలమద్ది నుంచి మారుతీనగర్ జాతీయ రహదారి వరకు బీటీ రోడ్డుకు రూ. 39.80 లక్షలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నిధులు మంజూరు చేసిన మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

ఓబన్న విగ్రహావిష్కరణ

కోరుట్ల మండలంలోని మాదాపూర్‌లో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్డెర ఓబన్న విగ్రహాన్ని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ శుక్రవారం ఆవిష్కరించారు. సింగిల్‌విండో చైర్మన్ ఆదిరెడ్డి, మాజీ ఎంపీపీ తోట నారాయణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్‌పాల్గొన్నారు.

భూ కబ్జాలపై సమగ్ర విచారణ జరపాలి

గొల్లపల్లి: గొల్లపల్లి మండల కేంద్రంలో 735, 544 ఇతర సర్వే నంబర్లలో అక్రమ నిర్మాణాలు జరిగిన వాటిపై అధికారులు సమగ్ర విచారణ జరిపి, అమాయకుల నుంచి డబ్బులు దండుకున్న వసూల్ రాజాలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షులు కట్ట మహేశ్ డిమాండ్ చేశారు. 735 సర్వేనంబరులోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. అక్రమ నిర్మాణాలు చేసుకున్న వారిపై, డబ్బులు దండుకున్న వారిపై ప్రభుత్వ విప్ చర్యలు తీసుకోవాలని కోరారు. నిరుపేదలకు పక్కా ఇళ్లు ఇచ్చేంత వరకు పోరాటం చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

కొండగట్టు: కొడిమ్యాల మండల వనరుల కేంద్రంలో శుక్ర వారం మండల స్థాయి భౌతిక శాస్త్రం టాలెంట్ టెస్ట్ నిర్వహించారు.మొదటి ర్యాంకు తిరుమలాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థి గంగుల అభినయ్, ద్వితీయ ర్యాంక్ కోనాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్.సుష్మశ్రీ, కె.రమ్యశ్రీ సాధించారు.

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎంఈవో చంద్రశేఖర్ చేతుల మీదుగా మెమొంటోలు అందించి అభినందించారు.

రాయికల్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాయికల్ ఫిజికల్ సైన్స్‌ఫోరం ఆధ్వర్యంలో భౌతిక శాస్త్ర ప్రతిభ పరీక్షలు నిర్వహించగా రాయికల్‌కు చెందిన హర్షవర్ధన్ మొదటిస్థానం, అల్లీపూర్‌కు చెందిన అక్షయ రెండో స్థానం, మూటపల్లికి హార్థిక మూడోస్థానంలో నిలిచారు. వీరికి ఎంఈవో రాఘవులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ సైన్స్ ఫోరం ఉపాధ్యాయులు ముక్కెర శేఖర్, చిలువేరి విజయ్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లతో విద్యార్థులకు మేలు

మల్లాపూర్: విద్యార్థుల్లో ప్రతిభా పాటవాలను, సామర్థ్యాలను వెలికితీసేవి టాలెంట్ టెస్టులని ఎంఈవో దామోదర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంఆర్సీలో ఎఫ్‌పీఎస్‌టీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. విజేతలు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఎస్‌టీ అధ్యక్షుడు బందరకంటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి లింగన్న, ఫిజికల్ సైన్స్ గైడ్ టీచర్లు అంజయ్య, రమణారావు, సత్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి: భీమారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి ఫిజికల్ సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. భీమారం పాఠశాలకు చెందిన గంప రుష్విత ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా రుష్వితను హెచ్‌ఎం జవ్వాజి అశోక్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయిలో గురుకుల విద్యార్థిని ప్రతిభ

మల్యాల: మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల కళాశాల విద్యార్థిని డి.హర్షిక రాష్ట్రస్థాయి ఇంగ్లిష్ ఒలంపియాడ్ పోటీల్లో ప్రతిభ కనబర్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జరిగిన ఇంగ్లిష్ ఒలంపియాడ్‌లో విద్యార్థిని హర్షిక తృతీయ స్థానంలో నిలిచి, రూ.2000 నగదు బహుమతి గెలుచుకున్నట్లు ప్రిన్సిపాల్ మానస తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థిని గైడ్ టీచర్లు ఎస్.కాజల్‌కుమారి, అక్షర పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

జగిత్యాలటౌన్: బెంగుళూరులో ఫిబ్రవరి 11 నుంచి 17వరకు నిర్వహించే జాతీయ సమైక్యత శిబిరానికి జగిత్యాల ప్రభుత్వ మహిళా కళాశాల డిగ్రీ విద్యార్థిని, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ కె మేఘన ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా ప్రమోద్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా మేఘనను శుక్రవారం కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా ప్రమోద్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డా జి శ్రీలత, డి.సుజాత, ఎన్ సంగీత రాణి, అధ్యాపకులు డా వరప్రసాద్, రహీం, రాంచంద్రం, వాసవి తదితరులు అభినందించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

సారంగాపూర్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఉపాధిహామీ ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు కోటిరెడ్డి అన్నారు. ఈ మేరకు మండల ఎంపీడీవోకు తమ డిమాండ్లపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీవో లత, టెక్నికల్ అసిస్టెంట్ శివ పాల్గొన్నారు.

పరామర్శ

పెగడపల్లి: అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన పెగడపల్లి మాజీ జెడ్పీటీసీ గజ్జల వసంత కుటుంబ సభ్యులను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం పరామర్శించారు. వసంత మృతి పట్ల ఈశ్వర్ ప్రగాఢ సానుభూతి తెలుపుతూ ఆమె మృతికి గల కారణాలను భర్త గజ్జల స్వామిని అడిగి తెలుసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కోరుట్ల రూరల్: మెట్‌పల్లి మండలం కోనరావుపేట, రాంరావుపల్లె, పెద్దాపూర్, కోరుట్ల మండలంలోని సంగెం, నాగులపేట గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో రూరల్ ఏఈ భూక్యా శ్రీనివాస్ తెలిపారు.

రావి చెట్టును కాపాడాలని వినతి

మల్యాల: మండలంలోని ముత్యంపేట హనుమాన్ ఆలయ సమీపంలోని రావిచెట్టును కొందరు కొట్టివేయాలని చూస్తున్నారని, రావిచెట్టును కాపాడాలని కోరుతూ ధర్మ రక్ష సమితి ఆధ్వర్యంలో కార్యదర్శి స్వప్న, వీడీసీ చైర్మన్ మ్యాక లక్ష్మణ్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బద్దం తిరుపతిరెడ్డి, కొండబత్తిని త్రినాథ్, సంత ప్రకాశ్ రెడ్డి, బాలె సంజీవ్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి క్షీరాభిషేకం



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి క్షీరాభిషేకం చేసి పూలతో అలంకరించారు. అర్చకుడు శ్రీనివాసాచార్యులు మంత్రోచ్చరణలతో ఆలయ ప్రాంగణంలో లక్ష్మీహవన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారలను దర్శించుకున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైరు చోరీ

మల్లాపూర్: మండలంలోని ముత్యంపేట శివారులో నిజాం షుగర్ ఫ్యాక్టరీ వద్ద గుర్తుతెలియని దుండగులు శుక్రవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ వైరును చోరీ చేశారు. ఎన్‌డీసీఎల్ ఎస్‌వో నర్సయ్య కథనం ప్రకారం షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కిందపడేసి అందులోని కాపర్ వైరును చోరీ చేశారని, కాపర్ వైరు విలువ సుమారు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఉంటుందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

సెల్లార్‌లోకి దూసుకెళ్లిన కారు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రోడ్‌లోని ఓ బార్ వద్ద శుక్రవారం ఉదయం కారు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి అజాగ్రత్తగా కారు నడుపుతూ వెళ్లడంతో కారు అదుపుతప్పి సెల్లార్‌లోకి దూసుకెళ్లడంతో బారు వెయిటర్ శ్రీహరికి గాయాలయ్యాయి.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

జగిత్యాల: ప్రతీ కుటుంబానికి మహిళ వెన్నెముక అని తాజామాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి అన్నారు. శుక్రవారం విరూపాక్షి గార్డెన్స్‌లో ఆడవారికి ఆదివారం సెలవు అనే కార్యక్రమాన్ని టీవీ.సూర్యం ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్ని రంగా ల్లో ముందుండాలని, స్త్రీలను గౌరవించినప్పుడే నవసమాజం రూపు దాల్చుతుందన్నారు. బుల్లితెర నటులు శృతి, వినోదిని, నరేశ్, శ్రీనివాస్, రామకృష్ణ, గుండేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

మల్యాల: రైతులకు అవసరమైన యూరియా ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయాధికారి కె.చంద్రదీపక్ తెలిపారు. మండలంలోని నూకపల్లి సొసైటీలో 450 బస్తాల యూరియా, పోతారంలో 250, మల్యాలలో 450, తక్కళ్లపల్లిలో 200 బస్తాల యూరియా అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా దుర్గామాత బోనాలు



కథలాపూర్: మండలంలోని ఇప్పపెల్లిలో శుక్రవారం దుర్గామాత బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో గ్రామంలో ప్రధానవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి చేసి దుర్గామాత ఆలయానికి చేరుకుని, దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపులో డప్పుచప్పుళ్లు, డ్యావతుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గది నిర్మాణం అసంపూర్తిగా ఉంది. సుమారు పదేళ్ల క్రితం నిర్మాణం పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. అసంపూర్తి నిర్మాణంలో ఉన్న గది గోడలకు ఉన్న ఇటుకలు రాలి కింద పడుతున్నాయి. విద్యార్థులు అటువైపు వెళ్లితే ప్రమాదం పొంచి ఉంటుంది. అధికారులు చొరవ చూపి తరగతి గది నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రీనివాస్ నాయక్, ఏఈ,ట్రాన్స్‌కో రూరల్, కోరుట్ల, సెల్ నంబర్: 9491245473

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు





కోరుట్లలో వాసవీ మాతకు ఒడి బియ్యం తీసుకెళ్తున్న భక్తులు మల్లాపూర్‌లో హోమం

కోరుట్ల/రాయికల్/మెట్‌పల్లి/మల్లాపూర్/గొల్లపల్లి: కోరుట్ల,రాయికల్, మెట్‌పల్లి పట్టణాలు, మల్లాపూర్, గొల్లపల్లిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వాసవీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం, పట్టు వస్త్రాలు ఊరేగింపుగా తీసుకవెళ్లి సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



కోరుట్లలో నివాళి అర్పిస్తున్న నాయకులు



మల్లాపూర్ మండలం నడికుడలో..

గద్దర్‌కు నివాళి

కోరుట్ల/మల్లాపూర్/ కథలాపూర్/ఇబ్రహీంపట్నం: గద్దర్ జయంతి సందర్భంగా కోరుట్ల పట్టణం, మల్లాపూర్, కథలాపూర్, ఇబ్రహీంపట్నం మండలాల్లో ఆయన చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు,దళిత నాయకులు నివాళి అర్పించారు. తెలంగాణ ప్రజలను చైతన్యపరచడంలో గద్దర్ పాటలు ఎంతో కృషి చేశాయన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయక పోరాటం గొప్పదని కొనియాడారు. కార్యక్రమాల్లో జువ్వాడి కృష్ణారావు, కాంగ్రెస్ నాయకులు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు 2.5కే రన్



మాట్లాడుతున్న ఐఎంఏ ప్రతినిధులు

జగిత్యాల: ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఫిబ్రవరి 4న ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా జగిత్యాలలో 2.5కే రన్ నిర్వహించనున్నట్లు ఐఎంఏ అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. క్యాన్సర్ సంబంధిత మరణాల్లో మనదేశం రెండో స్థానంలో ఉందన్నారు. 9 నుంచి 14 ఏళ్ల ఆడపిల్లలు రెండు మోతాదుల్లో టీకా తీసుకుంటే క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ ద్వారా సర్వైకల్ క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సీనియర్ వైద్య నిపుణులు మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, గైనకాలజిస్ట్ రజిత, శ్రావణ్, రమేశ్, ప్రవీణ్, సంతోష్, ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి, సుదీర్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దడంలో హెచ్‌ఎంల పాత్ర కీలకం

జగిత్యాల: విద్యార్థులను తీర్చిదిద్దడంలో ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకమని డీఈవో రాము అన్నారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించ్చురు. కార్యక్రమంలో అధ్యక్షుడు చల్ల లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి విజయ్‌భాస్కర్, శ్రీనివాస్, నర్సయ్య, సుదర్శన్, రమేశ్, లక్ష్మి, హేమలత, కనకతార పాల్గొన్నారు.

బీడీ పరిశ్రమపై జీఎస్టీ పెంచొద్దు

కోరుట్ల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో బీడీ పరిశ్రమపై జీఎస్టీ పన్ను పెంచవద్దని బీడీ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణంలో ఫెడరేషన్ రెండో మహాసభలు జరిగాయి. రాష్ట్ర అధ్యక్షుడిగా గోవర్ధన్, ప్రధాన కార్యదర్శిగా సుతారి రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చిన్నారులకు ఆటపాటలతో బోధించాలి

కథలాపూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు టీచర్లు ఆటపాటలతో బోధించాలని కథలాపూర్ మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హైమాది బేగం సూచించారు. శుక్రవారం కథలాపూర్‌లో అంగన్‌వాడీ టీచర్ల మండలస్థాయి సమావేశం నిర్వహించారు. కేంద్రాలవారీగా సమీక్షించారు. "ప్రీ స్కూల్ స్టడీ మెటీరియల్‌ను అంగన్‌వాడీ టీచర్లకు పంపిణీ చేశారు. స్టడీ మెటీరియల్‌పై అంగన్‌వాడీ టీచర్ల సందేహాలను నివృత్తి చేశారు.